# మినీ కథ

## ఆత్మపరిశీలన

ఎమ్. వింధ్యారాణి



ప్రియమైన బావకు–

నీ 'వీణ' శుభాకాంక్షలతో వ్రాయునది. క్షేమమని ఆశిస్తాను. చాలా రోజులకు నా నుంచి లెటర్ అందుకున్నావు కదూ! ఆశ్చర్యంగా వుందా? నేను విన్న విషయాలు నీకు లెటర్ వ్రాసేలాపురిగొల్పాయి. నేను యిలా చనువుచేసి వ్రాస్తున్నందుకు 'అపార్థం' చేసుకోవుగా! నీ చిట్టి మరదల్ని నీ చిన్ననాటి నేస్తాన్ని కనుక ఇలా చనువు తీసుకోవటంలో 'తప్పు లేదనే' అనుకుంటున్నాను.

"బావా! చదువు. సంస్కారం ఉండి కూడా నీవలా బిహేవ్ చేసావని. నేను కలలో కూడా అనుకోలేదు. అత్తయ్య. మామయ్య ఒక్క కొడుకువని నిన్నెంత గారాబంగా పెంచారు? నీ కోసం వాళ్ళు అహర్నిశలూ ఎంత శ్రమించాయి?నీక్షేమం. ఆనందం కోసం వాళ్ళెంత కలవరించారు? నీ ఉన్నతి కోసం వాళ్ళెంత తపించి పోయారు? అలాంటి అమృతమూర్తులను ఈనాడు నీవిలా నిరాదరణకు గురిచేయటం భావ్యమా బావా?

వాళ్ళు నీ యెడల చూపిన ప్రేమాభిమానాలకు సంబంధించి ఒక్క సంఘటన కూడా నీకు గుర్తుకు రావటం లేదా? వస్తే నిన్ను తప్పక కదిలించి ఉండేదని నా భావన! లేక. గుర్తుకొచ్చినా మరిచినట్లు నటిస్తున్నావా?

నీ గురించి మేమంతా ఎంతో ఉన్నతంగా ఊహించాము. కాని బావా! నీవందుకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నావు. అసలిప్పుడు నేనే కనుక నీఎదురుగా ఉండిఉంటే నీ రెండు చెంపలూ వాయించేదాన్ని. ఆవేదనతో లోలోపలే తల్లడిల్లుతున్న అత్తయ్య. మామయ్యను చూస్తుంటే. నీమీద నా కంత పిచ్చి ఆవేశం వస్తున్నది. ఛా! ఛా? నీ సంస్కారమంతా ఏ గంగలో కలిసింది బావా? వివాహం చేసుకున్నంత మాత్రాన నీలో ఇంత క్రూరమైన మార్పు రావాలా?

చూడు బావా! భార్య మీద వ్యామోహం ఉండకూడదని. ఆమె అభిప్రాయాలకు విలువనివ్వకూడదనీ నేననను. ఎలా అనగలను? నేనూ ఓ మగవాడి భార్యనేకదా! కాని గుడ్డిగా మూర్ఖంగా బిహేవ్‌చేస్తేనే వస్తుంది చిక్కంతా. పెళ్ళైన మగవాళ్ళంతా నీలాగా కని. పెంచిన తల్లిదండ్రులను గాలికి వదిలేసి. పెళ్ళాం కొంగు పట్టుకోవటమే పరమావధిగా భావిస్తున్నారా?

నీకు కాస్త జలుబు చేస్తేనే రాత్రింబవళ్ళూ నీ మంచంవద్దనే కూలబడి. వాళ్ళలా సపర్యలు చేసేవాళ్ళు కదా! అలాంటిది ఈనాడు వాళ్ళు వృద్ధాప్యంలో అనారోగ్యంతో బాధపడుతుంటే సేవలుచేయవలసిందిపోయి ఒక్క చల్లని ఓదార్పు వాక్యానికయినా వాళ్ళు నోచుకోలేదా? పైపెచ్చు చీత్కరిస్తావా? వాళ్ళనా స్థితిలో వదిలి భార్యతో షికార్లు చేస్తావా? రోజంతా వారి కోసమే నిన్ను 'స్పెండ్' చేయమని అనటం లేదుగా! ఆఫీసు నుంచి రాగానే పసిపిల్లలకు మల్లే ఒక్క మాట అప్యాయంగా మాట్లాడితే. వాళ్ళకెంత శాంతంగా ఉంటుంది! ఇందులో నీ సొమ్మేమీ పోదు కదా!

ఆనాడు వాళ్ళు వేలకు వేలు ఖర్చుచేసి చదివించారు కనుకనే. ఈనాడిలా గొప్ప ఆఫీసరువై కులుకుతున్నావు! అది వాళ్ళ డ్యూటీ. నేనూ కాదనను! కాని వాళ్ళవట్ల నీ కర్తవ్యంమాటకూడా ఆలోచించాలికదా! పుణ్యక్షేత్రాలకు వెళతామని నోరు తెరిచి అడిగితే "హేళన" చేస్తావా? వాళ్ళనలా హేళనచేసి పంపించటానికి నీకు మనస్సెలా ఒప్పింది బావా? వెరీ బాడ్ బావా! వెరీ బాడ్!

'పెద్దవయస్సులో వాళ్ళుమరలా మనకు పసిపిల్లలతో సమానమన్న' -ఒకే ఒక్క సున్నిత విషయాన్ని నీవు గుర్తుంచుకో! వాళ్ళను కాస్త ప్రేమగా పలకరించు! అదే వాళ్ళకు వేయి ఏనుగుల బలాన్నిస్తుంది. వాళ్ళు కేవలం నీనుంచి ఆశిస్తున్నది అప్యాయతేకాని- మణులూ, మాన్యాలేమీ కాదుకదా!

నాకు వాళ్ళేదో బరువై. భారమై నీ వద్దకు పంపే ఉద్దేశ్యంతో ఇలా రాస్తున్నానని మాత్రం అనుకోకు! నేను. రమేష్ వారినెంత బాగా చూసినా కూడా వాళ్ళ మనస్సు నీ చుట్టూనే ఉన్నది. ఏదో గిల్టీగా లోలోన ఫీలవుతున్నారు. వాళ్ళ మూగవేదననర్థం చేసుకున్నదాన్ని కనుక. ఇలా సాహసించి వ్రాస్తున్నాను. నిన్ను. నీ వొక్కసారి 'ఆత్మ పరిశీలన' చేసుకొని. వీలయినంత త్వరలో నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తిస్తావని ఆశిస్తూ ..........

నీ చిట్టి మరదలు

— వీణ